క్లుప్తంగా

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 14 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 10 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆర్టీసీ కాలనీ (మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో ల్యాండ్ మార్కు రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్, తులసిరాం చాంబర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 2 గంటల వరకు మదీనాగూడ ఫీడర్ పరిధిలో సాయికృప అపార్ట్‌మెంట్స్, రామకృష్ణనగర్, గాయత్రి టవర్స్, ఎస్ఎస్‌కె బ్లిస్, యశోద పెరల్స్ ఏరియా ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 100-120, పచ్చిమిర్చి 60 (నల్లవి),80 (తెల్లవి), బెండ 45, కాకర 65, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 45, కీర 30, బీర 60, వంకాయ 50, గోకర 45, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 300, వెల్లుల్లి 220.

చిత్రమయి ఆర్ట్‌గ్యాలరీ

మొత్తం 7 గ్యాలరీలు.. సందర్శకులు తిలకించేందుకు ఉదయ10.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
ఒక గ్యాలరీ బుక్ చేసుకునేందుకు రూ.3500 (ఆర్టిస్టులకు)
బుక్ చేసుకోవాలనుకున్న వారు సంప్రదించాల్సిన ఫోన్.9100022957,9100022958


శిల్పారామంలో చూడవలసిన ప్రదేశాలు

స్కల్పర్ పార్కు, విలేజ్ మ్యూజియం, కోనసీమ, పక్షుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ప్రదేశాలు, చిన్నారుల ప్లే గ్రౌండ్స్, బృందావనం తదితర ప్రాంతాలు
శిల్పారామం ఎంట్రీ పెద్దలకు రూ. 60
చిన్నారులకు: రూ. 20
బోటింగ్: రూ. 30
బ్యాటరీ కార్: రూ. 15
ఎడ్లబండి: రూ. 20
సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

నేటి నుంచి గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర

హఫీజ్‌పేట్ : నేటి నుంచి గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర తిరిగి మొదలవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా విరామం ఇచ్చామని గురువారం తిరిగి మళ్ళీ యధావిధిగా ప్రజాయాత్ర కొనసాగుతుందన్నారు. 71వ రోజు హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లలో పాదయాత్ర జరుగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా, యువ మోర్చా, ఓబీసీ మోర్చా, ఎస్టీ మోర్చా, దళిత మోర్చా, వివిధ అనుబంధ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి



వినతిపత్రం అందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

హఫీజ్‌పేట్ : ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓకు బుధవారం హఫీజ్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో దాదాపు 620 మంది ల్యాబ్ టెక్నీషియన్లు డీఎస్సీ ద్వారా సెలెక్ట్ కాగా, వివిధ విభాగాలలో 22 సంవత్సరాలుగా ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కొవిడ్- 19 మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామన్నారు. సమాన పనికి సమాన వేతనం వర్తింపు చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చే విధంగా చూడాలని వారు విన్నవించారు. మూడు రోజులలో సమస్యలపై స్పందించకుంటే తదుపరి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.



హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ నమూనా చిత్రం



పనులు ప్రారంభమైన దృశ్యం

హఫీజ్‌పేటకు ఆధునిక హంగులు

అమృత్ భారత్‌లో భాగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్

హఫీజ్‌పేట్ : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. హైదరాబాద్ దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులకు 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద శ్రీకారం చుట్టాయి.

- రూ.26.6 కోట్లతో రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.
- ప్రయాణికులకు పలు సౌకర్యాలతో పాటు హోటల్స్, మాల్స్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.
- రైల్వే స్టేషన్ ప్రాంగణంలో లైటింగ్ వ్యవస్థ, ఎస్కలేటర్లు, రైల్ ఓవర్ బ్రిడ్జి, దివ్యాంగులకు వసతులు, ఉచితంగా వైఫై అందించనున్నారు.
- గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గ్రీనరీని ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు.
- ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్‌ను సిటీ సెంట్రల్‌గా రైల్వే భవనం, ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్ మోడల్ ఇంటిగ్రేషన్, ప్రయాణికులకు మార్గనిర్దేశం కొరకు సంకేతాలు, ల్యాండ్ స్కేపింగ్, కళ, సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.
- రైల్వే ప్రయాణికులకు స్పష్టమైన ఎల్‌ఈడీ ఆధారిత స్టేషన్ సూచిక బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు.
- స్టేషన్‌లో అవసరానికి తగినట్టుగా పైకప్పుతో సహ ఎత్తైన ప్లాట్‌ఫారమ్‌లు నిర్మించనున్నారు.
- సాంకేతికంగా అభివృద్ధి చేయబడిన ప్రజా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

రూపురేఖలు మారిపోతాయి



అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ రూపు మారిపోనుంది. మియాపూర్, హఫీజ్‌పేట్, మదీనాగూడ ప్రజలకు రైలు ప్రయాణం సులువుగా ఉంటుంది.
– బోయిని మహేష్ యాదవ్, హఫీజ్‌పేట్

రాకపోకలు పెరుగుతాయి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ అభివృద్ధితో ప్రయాణికుల రాకపోకలు పెరుగుతాయి. ఇప్పటికే వారాంతంలో స్టేషన్ కిక్కిరిసిపోతుంది. అభివృద్ధి పనులతో రానున్న రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుంది.
–గోడె గోపాల్, మదీనాగూడ

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యం



సిద్ధిఖీనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్, నాయకులు, కాలనీవాసులు

గచ్చిబౌలి: డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌లో అనంత టెక్నాలజీ నుంచి జూబ్లీ ఎన్‌క్లేవ్ వరకు రూ.2.35 కోట్లతో నూతనంగా చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్‌తో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కి ఒక కిలోమీటర్ చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలలో యూజీడీ పైప్ లైన్ పనులను దశలవారీగా చేపడుతున్నామన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, నాయకులు గణేష్ ముదిరాజ్, రవీందర్‌ముదిరాజ్, మాదవరం రంగారావు, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల కృష్ణ, జంగంగౌడ్, నర్సింహ్మా, తిరుపతి రెడ్డి, తిరుపతి, గణపతి, రజనీకాంత్, యాదగిరిగౌడ్, నందుసింగ్, నరేష్, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



నల్లగండ్లలో సమావేశమైన నాయకులు

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

శేరిలింగంపల్లి: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శేరిలింగంపల్లి నల్లగండ్లలో కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునందన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అంజిబాబు, నవీన్, నర్సింహ ముదిరాజ్, సందీప్‌రెడ్డి, రవీందర్, పాల్గొన్నారు.

త్వరలో సీసీ రోడ్లు వేయిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. సీసీ రోడ్లకు రూ.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మహేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



మాదాపూర్: అతివేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లిహిల్స్ నుంచి ఐకియా వైపు వెళ్తున్న బ్రీజా కారు డ్రైవర్ కిరణ్ (22) ప్యాసింజర్‌ని ఎక్కించుకుని అతి వేగంగా కేబుల్ బ్రిడ్జిపై వెలుతూ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం అయ్యారు. వివరాలిలా.. మెకానిక్ షాప్‌నకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఈ.వి రమణ కథనం ప్రకారం... బిహార్ కు చెందిన మహ్మద్ నూరాలం అతని సోదరుడు మహమ్మద్ శంషాలం ఇద్దరు బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీలో నివాసం ఉంటున్నాను. కాగా మహ్మద్ నూరాలం వందనపురి కాలనీ సమీపంలో ఓ మెకానిక్ షెడ్ వద్ద పని నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో పనికి వెళ్తున్నానని చెప్పి ఎనిమిదో తేదీ ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లిన మహ్మద్ నూరాలం తిరిగి రాలేదు. దీంతో సోదరుడి కోసం శంషాలం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు.దీంతో సోదరుడు అదృశ్యంపై శంషాలం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంతో వచ్చి..

కొడుకు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా... శంకర్‌పల్లికి చెందిన అజయ్ జాదవ్ ఏడవ తేదీన శంకర్‌పల్లి నుండి పటాన్‌చెరుకి ప్లాస్టిక్ లోడు కోసం డీసీఎం తీసుకొని వచ్చాడు. పటాన్‌చెరుకు చెందిన శేఖర్ అనే వ్యక్తి ప్లాస్టిక్ గోదాం వద్ద వస్తువులు లోడ్ చేసుకుంటుండగా అజయ్ జాదవ్ వెళ్లిపోయాడు, ఫోన్ చేసి చూడగా స్విచ్ఛాఫ్ వచ్చింది.దీంతో తండ్రి దిలీప్‌సురేష్ కుమారుని కోసం విచారించినా ఆచూకీ లభించలేదు.దీంతో కుమారుడి అదృశ్యంపై తండ్రి దిలీప్ పోలీసులు ఫిర్యాదు చేశాడు.

మద్యం తాగొద్దన్నందుకు..

మద్యం తాగొద్దని భర్త మందలించడంతో భార్య వెళ్లిపోయింది. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఇంద్రేశం గ్రామానికి చెందిన కవి రాములు గ్రామపంచాయతీ కార్మికుడు. ఇతని భార్య కన్నమ్మకు మద్యం తాగే అలవాటు ఉంది. రోజు మద్యం తాగుతుండడంతో భర్త అడిగే సరికి ఇంటి నుండి వెళ్లిపోయింది. దీంతో భార్య కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

బయటకు వెళ్లొస్తానని చెప్పి..

బయటకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగిరాలేదు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సాకు చెందిన పూజార బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్ నగర్ కాలనీలో ఉంటూ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో 7 వ తేదీ మధ్యాహ్నం రూమ్ లో ఉండే వరుసకు కొడుకైన సుఖ్‌దేవ్‌కు ఫోన్ చేసి నేను బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు.తిరిగి రాకపోవడంతో సుఖ్‌దేవ్ తెలిసిన వారి వద్ద ,స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఒరిస్సాలో ఉన్న కుటుంబ సభ్యులను అడగగా రాలేదని చెప్పారు. దీంతో పూజార అదృశ్యంపై సుఖ్‌దేవ్ ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ ,మంగళవారంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురు పట్టుబడ్డారని చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఏడు మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బంగారం, ఏడు లక్షల నగదు మాయం

పటాన్‌చెరు టౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారు వస్తువులు ,ఏడు లక్షలు నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ హనుమాన్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న సిమోన్ చర్చి పాస్టర్. మంగళవారం పిల్లలని స్కూలుకు పంపి, ఉదయం 11:30 గంటలకు భార్య సుజాత తో కలసి షాపింగ్ కోసం చార్మినార్ వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా బీరువాలో ఉన్న బంగారు పుస్తెలతాడు, లాంగ్ చైన్, కమ్మలు, నాలుగు రింగులు, ఏడు లక్షల నగదు చోరీ అయినట్టు గుర్తించి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ,ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- బ్రిగేడ్ కమాండర్ బ్రిగేడియన్ గణేష్ నాగరాజన్
- నాసర్ బాయ్స్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ



నాసర్ బాయ్స్ స్కూల్‌లో ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని 47వ ఇన్‌ఫ్యాన్‌ట్రీ బ్రిగేడ్ కమాండర్ బ్రిగేడియన్ గణేష్ నాగరాజన్ సూచించారు. గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్‌లో 24వ ఇన్వెస్టిట్యూర్ సెర్మనీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చదువులోనే కాకుండా క్రీడల్లో, దేశభక్తి పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎంపికైనవారికి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో నాసర్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్‌పర్సన్ సల్వాఖాన్, బోర్డు డైరెక్టర్లు మీర్ హఫీజుద్దీన్ అహ్మద్, ప్రిన్సిపల్ మొహియుద్దీన్ మహ్మద్, జమాలుద్దీన్ అహ్మద్, రెనిథామస్, జలక్ష్మా, మధుసూదన్, ఆయేషా ఫాతిమా, అంజుబ్ మమ్, లక్ష్మణ్‌రావు, సత్యమహేష్, మసూద్ బిపిన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నాగేందర్‌యాదవ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు



రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి వార్డు కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద కాలనీ అసోసియేషన్లు, టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి పూల మాలలు, శాలువాలతో ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. క్రేన్ సహాయంతో అభిమానులు భారీ పూల మాల వేశారు. ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ హాజరై బర్త్ డే కేక్‌ను కట్ చేయించారు.

రక్తదాన శిబిరం

టీమ్ ఆర్ఎన్‌వై ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



చందానగర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రఘునాథ్ యాదవ్

హఫీజ్‌పేట్ : చందానగర్‌లో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంను బుధవారం ఘనంగా నిర్వహించారు. సెయింట్ థెరిస్సా హాస్పిటల్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ హాజరై మాట్లాడుతూ సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలతో కొందరినైనా కాపాడవచ్చన్నారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దుర్గేష్, నాయకులు సౌందర్య రాజన్, మహిపాల్ యాదవ్, వీవీ చౌదరి, రాజేందర్‌రెడ్డి, ముషార్రఫ్, కిషోర్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య.. నిరసన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్ మాట్లాడుతూ గతంలో మురుగునీరు సాఫీగా వెళ్లేదని, రేడియల్ రోడ్డు ఆనుకొని సర్వీస్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న వర్షపు నీరు వెళ్లే కాలువ నిర్మాణం కారణంగా డ్రైనేజీ సమస్య తలెత్తిందని తెలిపారు. కాలువ నిర్మాణం కోసం డ్రైనేజ్ నీరు వెళ్లే పైపులను మూసివేసారని తెలిపారు. దానితో డ్రైనేజీ నీళ్ల వెనక్కి వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ శ్రీనివాస్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే టీచర్ల సమస్యల పరిష్కారం



పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు కె.నారాయణ గౌడ్‌ను సన్మానిస్తున్న చెన్న కేశవరెడ్డి, యూనియన్ నాయకులు

శేరిలింగంపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ టీఎస్‌తోనే సాధ్యం అని ఆ యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి తెలిపారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని శేరిలింగంపల్లి, లింగంపల్లి, కొండాపూర్, మియాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్న కేశవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కోర్టు జడ్జిమెంట్ వచ్చిన వెంటనే బదిలీలు, పదోన్నతులు వస్తాయన్నారు. అదే విధంగా భాష పండితుల సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఈనెల 31 తేదీ లోపు పాత పెన్షన్ తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నారాయణగౌడ్, ఎస్.మహేందర్‌రెడ్డి, పత్రికా సంపాదకవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు హన్మంతు, యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బలరాం, శివకుమార్, సరోత్తం రెడ్డి, అనంత్‌రెడ్డి, రాములు, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..



వాహనాల పార్కింగ్



హుడాకాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు తాళం వేసిన దృశ్యం

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని కమ్యూనిటీ హాల్ భవనం నిరుపయోగంగా మారింది. కాలనీ కోసం. ప్రభుత్వ కార్యక్రమాల కోసం లక్షల నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మిస్తే పట్టించుకునే వారు లేరు. గతంలో కంటి వెలుగు, ఇతర కార్యక్రమాలకు వినియోగించుకున్నా ఇప్పుడు దాని వైపు చూసే వారు లేరు. కాగా కమ్యూనిటీ హాల్ పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోయింది. పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ప్రధాన గేటు ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ కమ్యూనిటీ హాల్‌ను కాలనీవాసులు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.